ఈనాడు
జగిత్యాల
శనివారం సెప్టెంబరు 28, 2024 5

చాలీచాలని నిధులు..!

- ■ పెద్దవాగుపై అసంపూర్తిగా వంతెనల నిర్మాణం
- ■ ఏళ్ల తరబడి రాకపోకలకు అవస్థలు

- ● గ్రామం
- ■ నిధులు
- ◆ ప్రారంభం
- ▲ ప్రస్తుత పరిస్థితి

న్యూస్‌టుడే, కోరుట్ల, మెట్‌పల్లి

పల్లెల మధ్య దూరాభారం తగ్గించి ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు పెద్దవాగుపై వంతెన నిర్మాణాలు చేపట్టాలని పాలకులు నిర్ణయించారు. వంతెన నిర్మాణాలకు చాలీచాలని నిధులు కేటాయించడంతో ఏళ్ల తరబడి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో నెలల తరబడి వాగులు పొంగి పారుతుండటంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు అవతలి వైపునున్న రైతులు వ్యవసాయక్షేత్రాలకు వెళ్లేందుకు మార్గం లేక దూర ప్రాంతాల నుంచి తిరిగి వెళ్తూ అవస్థలు పడుతున్నారు.


కోరుట్ల శివారులోని ఫుల్‌వాగులో పిల్లర్ల దశలో వంతెన

● కోరుట్ల ఫుల్‌వాగుపై వంతెన ■ నాబార్డు నిధులు రూ.2.80 కోట్లు ◆ 2017 జనవరి 20 ▲ కోరుట్ల పట్టణ శివారులోని ఫుల్‌వాగుపై వంతెన నిర్మాణ పనులను ఏడున్నరేళ్ల కిందట ప్రారంభించారు. నామమాత్రపు నిధులు కేటాయించడంతో పిల్లర్లు, చెక్‌డ్యాం కోసం వాల్ నిర్మించి వదిలేశారు. తర్వాత రూ.3 కోట్ల నిధులు కేటాయించాలని అధికారులు అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. గతేడాది రూ.కోటి కేటాయించారు. తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభించకుండా వదిలేశారు. వంతెన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. ఇరువైపులా వాల్ అసంపూర్తిగా నిర్మించడంతో ఒడ్డు కోతకు గురైంది.

● ఏఖీన్‌పూర్ పెద్దవాగుపై వంతెన ■ నాబార్డు, ఇతర నిధులు రూ.4.12 కోట్లు ◆ 2017 జనవరి 20 ▲ కోరుట్ల మండలంలోని ఏఖీన్‌పూర్ శివారులోని పెద్దవాగుపై 2017లో నాబార్డు నిధులు రూ.2.12 కోట్లతో వంతెన, చెక్‌డ్యాం నిర్మాణ పనులను ప్రారంభించారు. 2021లో రూ.2 కోట్ల నిధులు కేటాయించడంతో స్లాబ్‌వేసి ఇరువైపులా గోడలను నిర్మించారు. గతేడాది వాగులో ఉద్ధృతంగా వరద రావడంతో వంతెనకు ఓవైపు నిర్మించిన గోడలు కూలిపోవడంతో పాటు వాగు ఒడ్డునున్న భూమి పెద్దఎత్తున కోతకు గురైంది. కోతకు గురైన చోట అదనపు పిల్లర్ల నిర్మాణంతోపాటు వాల్ నిర్మించాల్సి ఉంది. గతేడాది రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినా విడుదల కాకపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేశారు.


ఏఖీన్‌పూర్-సంగె వాగుపై అసంపూర్తిగా వంతెన నిర్మాణం

● చౌలమద్ది పెద్దవాగుపై వంతెన ■ నాబార్డు నిధులు రూ.కోటి ◆ 2012 జూన్ 20 ▲ కోటి నిధులు మంజూరైనా సరిపోలేదని 2017లో రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. అప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో మూడేళ్ల కిందట మరో రూ.60 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు సుమారు రూ.3 కోట్ల నిధులు కేటాయించినా వంతెన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఇరువైపులా అసంపూర్తిగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం, రక్షణ దిమ్మెల ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన స్లాబులు పూర్తయిన తర్వాత పనులు ఆగిపోవడంతో తాత్కాలికంగా మొరం పోసుకుని రాకపోకలు సాగిస్తుండగా ఇరువైపులా రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా మారింది. ఫలితంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా చౌలమద్ది వంతెన

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. అనుమానాస్పద యాప్‌లను తెరవద్దని ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మపురి పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి సమాచారమివ్వాలని సూచించారు. బహుమతి, లాటరీల పేరుతో డబ్బులు చెల్లించాలని కోరితే పంపించవద్దని చెప్పారు. ఎస్సై గంగుల మహేష్ పాల్గొన్నారు.

త్యాగధనుడు కొండా లక్ష్మణ్


అంగడిబజార్‌లో విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్ తదితరులు

జగిత్యాల, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగధనుడని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రం కోసం రాజీలేని పోరాటం చేశాడని కొనియాడారు. పురపాలక ఛైర్‌పర్సన్ జ్యోతి, గిరినాగభూషణం, బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాంతం తపించాడని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, ఆర్డీవో పి.మధుసూదన్, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, బీసీ అభివృద్ధి అధికారి ఎల్.సాయిబాబా, డీపీవో ఎం.రఘువరన్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న అధికారులు

జిల్లాకు యువ టూరిజం క్లబ్ అవార్డు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాకు యువ టూరిజం క్లబ్ అవార్డు లభించింది. రాష్ట్రంలో మూడు జిల్లాలకు అవార్డు లభించగా జగిత్యాల జిల్లాకు మూడోస్థానం దక్కింది. అత్యధికంగా యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు అవార్డుకు ఎంపిక చేశారు. జగిత్యాల జిల్లా 298 క్లబ్‌లతో మూడోస్థానంలో ఉండగా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు అవార్డుతోపాటు రూ.లక్ష నగదు అందించారు. అవార్డు లభించిన సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు పి.రాంబాబు, గౌతంరెడ్డి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌కెఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరిగెల అశోక్ తదితరులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు అందరి కృషితో యువ టూరిజం అవార్డు లభించిందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చెప్పారు. భవిష్యత్తులో పర్యాటకం వల్ల కలిగే లాభాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పర్యాటక అనుబంధ రంగాల అభివృద్ధి తదితర అంశాలపై చిన్నప్పటి నుంచే యువ టూరిజం క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పురస్కారం దక్కినట్లు కలెక్టర్ చెప్పారు.


అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్


ధర్మపురి-జగిత్యాల మధ్య అనంతారం వద్ద దెబ్బతిన్న పురాతన వంతెన

ప్రమాదం అంచున.. పురాతన వంతెనలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధర్మపురి-జగిత్యాల జాతీయ రహదారిపై రెండు లోలెవల్ పురాతన వంతెనలు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ధర్మపురి మండలం ఆకుసాయిపల్లె, జగిత్యాల మండలం అనంతారం వద్ద ఈ వంతెనలు ఉన్న చోట హైలెవల్ వంతెనలను నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతోంది. రెండు హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ.2 కోట్లతో గతంలో ప్రతిపాదనలను పంపించారు. నిధులు మాత్రం మంజూరు కాలేదు. నిజామాబాద్ నుంచి మంచిర్యాల, గోదావరిఖని తదితర పారిశ్రామిక ప్రాంతాలకు ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ రహదారిపై నుంచి వెళ్తుంటాయి. ఏటా వర్షాకాలంలో భారీ వర్షాలకు ఈ వంతెనలపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ ఏడాది కూడా రెండు రోజుల పాటు నిలిచిపోయాయి. వంతెనలపై రహదారి పూర్తిగా దెబ్బతిని.. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరమ్మతులు చేయాలని స్థానికులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, ధర్మపురి

రెవెన్యూశాఖలో ఆరుగురి బదిలీ

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో ఆరుగురు సీనియర్ సహాయకులు, గిర్దావర్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్ గిర్దావర్-2 బి.శ్రీనివాస్‌ను ధర్మపురి తహసీల్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎన్.భూమేష్‌ను మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేయగా ఆ స్థానంలో ఉన్న పి.వెంకటేష్‌ను జగిత్యాల భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.స్వామిని కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా నియమించారు. కథలాపూర్ గిర్దావర్-1 ఎం.రాహుల్‌ను బీర్‌పూర్ గిర్దావర్-2 బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నం సీనియర్ సహాయకుడు కె.గంగాధర్‌ను కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో నియమించారు.

పట్టణాల్లో స్వచ్ఛత
లక్ష్యం నెరవేరేనా?
అమలుపై లేని చిత్తశుద్ధి

న్యూస్‌టుడే, ధర్మపురి

జిల్లాలోని అయిదు పురపాలికల్లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం లక్ష్యం ఘనంగా ఉన్నా.. అమలులో మాత్రం అధికారుల చిత్తశుద్ధి కరవై ఆశించిన స్థాయిలో జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. పరిశుభ్రతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం చేపట్టగా. . ఇందులో భాగంగా జిల్లాలోని పురపాలికాల్లో ఈ నెల 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులను ఇందులో భాగస్వామ్యం చేయాల్సి ఉండగా.. మొక్కుబడిగానే సాగిస్తున్నారు.

మహాత్మాగాంధీ స్ఫూర్తితో..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం కింద ప్రతి పల్లెలో పారిశుద్ధ్య పనులు, శ్రమ దానాలు చేయాల్సి ఉంది. మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రజలు శ్రమ దానం ద్వారా ప్రతి పురపాలికలో నిర్వహించాలి. ముఖ్య కూడళ్లు, ప్రజా స్థలాల్లో చెత్త తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలి. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పాల్గొనేలా చూడాలి. అలాగే కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్త వేరుచేయడం.. వార్డుల్లో ప్రతి పౌరున్ని భాగస్వామ్యున్ని చేయడంతోపాటు, స్వచ్ఛతా దివస్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించాల్సి ఉంది. విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అవగాహన కల్పించి.. వారికి క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించాలి.

మొక్కుబడిగానే కార్యక్రమాలు..

ఇందులో ప్రజలు, యువకుల భాగస్వామ్యం అంతంత మాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ కార్యక్రమం అమలులో మెట్‌పల్లి, ధర్మపురి పురపాలికలు ముందుండగా.. కోరుట్ల, రాయికల్ వెనుకబడ్డాయి. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా.. గడువు దగ్గర పడుతుండగా పెద్దఎత్తున స్వచ్ఛత పనులు, యువకులతో కలిసి శ్రమ దానాలు లక్ష్యం మేరకు చేయడం లేదు. కేవలం పుర అధికారులు ఆయా పట్టణాల్లోని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు.


ధర్మపురి గోదావరి తీరంలో పారిశుద్ధ్య కార్యక్రమం

ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పనులు..

పురపాలిక	లక్ష్యం	చేసిన పనులు	చేయాల్సినవి
ధర్మపురి	36	22	14
రాయికల్	20	10	10
కోరుట్ల	35	20	15
మెట్‌పల్లి	32	30	02
జగిత్యాల	38	20	18

మరింత వేగంగా చేపడతాం

ధర్మపురి పురపాలికలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నాం. ఇప్పటికే రహదారులను శుభ్రం చేయించాం. చింతామణి చెరువు కట్ట వద్ద పారిశుద్ధ్యం పనులు చేపట్టాం. రానున్న వారం రోజుల్లో మరింత వేగంగా పనులు చేపడతాం. లక్ష్యాన్ని సాధిస్తాం. – ధర్మపురి పుర కమిషనర్ గంగాధర్

పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల మెట్‌పల్లి, కథలాపూర్, కోరుట్లలో జరిగిన పలు సంఘటలనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్‌లలోని శాంతిభద్రతలపై చర్చించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేశ్‌బాబు, నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు. ఇటీవల కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో భర్త వేధిస్తున్నట్లు జగిత్యాలకు చెందిన మహిళ ఫిర్యాదు చేయగా ఎస్సై విచారణ పేరుతో పిలిపించి మందలించిన సంగతి తెలిసిందే. దీంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృత్యువాతపడ్డాడు. దీంతో కోరుట్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు ముందస్తుగా జగిత్యాల నుంచి రెండు వాహనాల్లో ప్రత్యేక బలగాలను రప్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉన్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

మల్లాపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు గ్రామ శివారుల్లోని కొండలను కొల్లగొడుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కొంత కాలంగా ప్రభుత్వ స్థలాలతో పాటు కొండలను యథేచ్ఛగా తవ్వుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జంతువులతో పాటు పక్షులకు నిల్వ నీడ లేకుండా పోతుంది. మట్టికి ఉన్న డిమాండ్‌ను దృష్టితో అనుమతులు లేకున్నా కొండలను ఇష్టం వచ్చినట్లు తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.


మల్లాపూర్ శివారులో గుట్టను తవ్వుతున్న యంత్రం

ఇద్దరు ఎస్సైలపై చర్యలు

జగిత్యాల, న్యూస్‌టుడే: ఇద్దరు ఎస్సైలపై ఒకే రోజు చర్యలు తీసుకోవడం జిల్లాలో చర్చనీయాంశమైంది. రాయికల్ ఎస్సై తీగల అశోక్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన ఎస్పీ అశోక్‌కుమార్ ఉన్నతాధికారులకు నివేదించగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కోరుట్ల ఎస్సై శ్వేతను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల చింతకుంటవాడకు చెందిన శివప్రసాద్ నిప్పంటించుకొని మృతి చెందగా భార్యభర్తల గొడవ విషయంలో ఎస్సై కొట్టడంతోనే శివప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.

గుంతల రోడ్లతో అవస్థలు

కోరుట్ల,న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలోని ప్రధాన సిమెంట్‌రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందిరారోడ్, టీచర్స్ క్లబ్‌రోడ్, రథాలపంపు, ఎల్ఐసీ కాలనీలోని సీసీరోడ్లు గుంతలమయంగా మారడంతోపాటు కంకర తేలడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు అవస్థల పాలవుతున్నట్లు వాపోతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని పురపాలక సంఘం అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేవంటూ ఏళ్ల తరబడి మరమ్మతులు చేయకుండా వదిలేశారు.


కోరుట్ల ఇందిరారోడ్‌లో దెబ్బతిన్న సీసీరోడ్డు


టీచర్‌క్లబ్ రోడ్‌లో కంకర తేలిన రోడ్డు

అల్పాహారం.. మహోపకారం



దాతలు స్పందిస్తే విద్యార్థులకు మేలు

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, మల్యాల

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుతుంటారు. పేదరికం.. ఇంట్లో తల్లిదండ్రులు ఉదయమే కూలీ పనులకు వెళ్లడం తదితర కారణాలతో ఏమీ తినకుండానే పాఠశాలలకు వెళ్తున్నారు. అసలే పోషకాహార లోపాలతో బాధపడుతున్న వారు సరైన సమయానికి అల్పాహారం అందక నీరసపడిపోతున్నారు. తరగతి గదుల్లో బద్ధకంగా ఉండటం, పాఠాలు సరిగా అర్థం చేసుకోలేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం గతేడాది అక్టోబరు 6న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న బడుల్లో అమలు చేసింది.. ఈ ఏడాది జనవరి వరకు అల్పాహారం, ఆగస్టు వరకు రాగిజావ అందించారు. త్వరలోనే కొన్ని మార్పులు చేసి అల్పాహారం పథకం పునః ప్రారంభించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆలోపు దాతలు స్పందిస్తే చిన్నారులకు ఇబ్బందులు తప్పించినవారవుతారు.

నియోజకవర్గంలో 200 మంది విద్యార్థులకు పైబడి ఉన్న పాఠశాలలకు ఉదయం అల్పాహారం అందిస్తా. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం చిరుతిళ్లు అందజేస్తా.

– బుధవారం గర్షకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉమ్మడి జిల్లా వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు :
3,312	3,78,005 మంది

అందరూ కలిసి అండగా నిలిస్తే!

సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు అయిదేళ్లపాటు ఉదయం రాగిజావ పంపిణీ చేశారు. దీంతో ఇంటి వద్ద ఉదయం తినిరాని విద్యార్థులకు కొంత ఉపయోగపడేది. ఈ విద్యా సంవత్సరం ఆగస్టు వరకు రాగిజావ పంపిణీ చేసి ఆపేశారు. అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వంతో ఒప్పంద గడువు ముగియడంతో నిలిచిపోయిందని చెబుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఖాళీ కడుపులతో మధ్యాహ్నం వరకు పాఠాలు వినాల్సి వస్తుంది. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో రోజూ రాగి జావ పంపిణీ చేయాలంటే దాదాపు రూ.300 వరకు ఖర్చు అవుతుంది. నెలకు రూ.9 వేలు, 10 నెలలకు రూ.90 వేలతో 100 మంది విద్యార్థులకు విద్యా సంవత్సరమంతా రోజూ పంపిణీ చేయొచ్చు. ఒక పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నా సంవత్సరానికి ఈ ఖర్చు రూ.4.5 లక్షలు దాటదు. ప్రభుత్వం స్పందించి అల్పాహారం ఏర్పాటు చేసే వరకు ఆగకుండా ఏ గ్రామానికి ఆ గ్రామంలో నాయకులు, దాతలు స్పందిస్తే చిన్నారులకు ఆకలి బాధలు తప్పుతాయి. బాగా చదువుకోగలుగుతారు.


సుల్తానాబాద్ : దేవునిపల్లి పాఠశాలలో గతేడాది రాగి జావ పంపిణీ

ప్రత్యేక తరగతుల సమయంలోనైనా..



నేను మద్దుట్ల గ్రామం నుంచి దాదాపు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు సైకిల్‌పై వెళతాను. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం అల్పాహారం చేయకుండానే వస్తుండటంతో మధ్యాహ్న భోజనం చేసేంత వరకు ఓపిక ఉండటం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక తరగతుల సమయంలోనైనా అల్పాహారం అందిస్తే మా లాంటి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– సంకుర్తి అనూష, పదో తరగతి, మద్దుట్ల, మల్యాల, జగిత్యాల జిల్లా

నేరుగా మధ్యాహ్న భోజనం తింటున్నా



ప్రతి రోజూ వడ్డెర కాలనీ నుంచి ఆర్టీసీ బస్సులో 10 కిలోమీటర్ల దూరంలో ఉండే ఒద్యారం జడ్పీహెచ్ఎస్‌కు వస్తుంటా. ఉదయం 8 గంటలకే బయల్దేరి వస్తా. రాగిజావ, అల్పాహారం పంపిణీ నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో ఉండాల్సిందే. ఉపాధ్యాయులను అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా లేదని చెబుతున్నారు.

– తోక సాయికుమార్, ఒద్యారం, గంగాధర మండలం, కరీంనగర్

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జగిత్యాల వ్యవసాయం: పోరండ్లలో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించి ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్యం, చీడపీడల నివారణపై లోహియా సాంకేతిక సలహాదారు వై.ఎస్.రంగనాయకులు వివరించారు.

దుకాణాల్లో తనిఖీలు

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణంలోని పలు దుకాణాల్లో జిల్లా ఆహార భద్రతాధికారి అనూష శుక్రవారం తనిఖీలు చేపట్టారు. నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు.

డీఎస్సీ 2008 బాధితుల జాబితా విడుదల

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ- 2008 బాధిత అభ్యర్థుల జాబితాను ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. డీఎస్సీ అర్హత సాధించి ఉద్యోగాలకు దూరమైన వారికి ప్రభుత్వం ఒప్పంద పద్ధతిన ఎస్జీటీ ఉద్యోగాలను కల్పించేందుకు ముందుకు వచ్చింది. సంబంధించిన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని రాష్ట్ర విద్యాశాఖ సూచించింది. దీంతో జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలో 61 మంది బాధిత అభ్యర్థులున్నట్లు రెండు రోజుల క్రితం ప్రకటించారు. అందులో ఉద్యోగాలు వారుండటం, నష్టపోయిన అభ్యర్థుల పేర్లు లేకపోవడంతో బాధిత అభ్యర్థులు ఆందోళన చెందారు.

186 మందితో

అభ్యర్థుల ఆందోళనపై 'అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది.

వందనం

స్పందించిన విద్యాశాఖ 61 మంది జాబితాను వెబ్‌సైట్ నుంచి తొలగించారు. వాస్తవంగా ఉద్యోగాలకు అర్హత సాధించి వాటికి దూరమైన 186 మంది అభ్యర్థులతో కొత్తగా జాబితాను జిల్లా విద్యాశాఖ రూపొందించి రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దాన్ని పొందుపర్చడంతో బాధిత అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే 186 మంది కాకుండా మొత్తం 228 మంది ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. డీఎస్సీ ఫలితాల మెరిట్ జాబితాలో ఉన్న పలువురు అభ్యర్థులు కొత్తగా ప్రకటించిన జాబితాను చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగార్హత సాధించి నష్టపోయిన తమ పేర్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన రెండో జాబితాలోనూ లేవని అభ్యర్థులు వై.వేణుగోపాల్, ఎస్.రాజిరెడ్డిలు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తామని డీఈవో పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన ఒక సెట్ జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకురావాలని తెలిపారు. శుక్రవారం 25 మంది వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేసినట్లు జిల్లా విద్యాశాఖ సిబ్బంది పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితా ప్రకటించడం, అప్పటి నుంచే పరిశీలన కార్యక్రమాన్నీ చేపట్టడం, పరిశీలన తేదీల విషయ సమాచారం సాయంత్రం విడుదల చేయడం వంటివి ఒక్కరోజులోనే జరిగిపోవడం గమనార్హం.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!



న్యూస్‌టుడే, మల్లాపూర్

■ రీచ్‌ల గుర్తింపులో అధికారుల నిర్లక్ష్యం
■ గోదావరి, వాగుల నుంచి అక్రమ రవాణా

జగిత్యాల జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ.. కిందిస్థాయి మైనింగ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు చెలరేగిపోతున్నారు. మల్లాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల పరిధిలో ప్రవహిస్తున్న పెద్దవాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద మొత్తంలో వాగుల్లో ఇసుక నిల్వలు ఏర్పడటం అక్రమార్కుల పాలిట వరంగా మారింది. కొరత తీర్చేందుకు జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇసుక డిపోలపై అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో పెద్దవాగు, గోదావరి ఇసుకకు డిమాండ్ ఉండటంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు ఆయా గ్రామాల్లోని నదుల నుంచి నేరుగా రవాణా చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం అగడంలేదు. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అవసరమైన రీచ్‌లను ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా అందినకాడికి దోచుకుంటున్నారు. రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుకను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. జగిత్యాల చుట్టుపక్కల ఉన్న జిల్లాలో ఇలాంటి ఏర్పాట్లు ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేయడంలేదు. మరోవైపు గోదావరి పరివాహక మండలాలతో పాటు వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు.



వెంపల్లి శివారులోని పెద్దవాగులో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

ట్రాక్టర్లలో తీసుకొచ్చి టిప్పర్లతో తరలింపు

నిత్యం పెద్దవాగులో విస్తారంగా ఉన్న ఇసుకను కూలీల సాయంతో ట్రాక్టర్లతో తీసుకువచ్చి రహదారికి సమీపంలో డంపులు ఏర్పాటు చేస్తారు. రాత్రి వేళ డంపుల నుంచి టిప్పర్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తారు. మల్లాపూర్, కోరుట్ల మండలాల నుంచి టిప్పర్లలో నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్‌ను బట్టి కొన్ని సందర్భాల్లో హైదరాబాద్ వరకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

రెవెన్యూ, పోలీస్ శాఖలు అభాసుపాలు

ఇసుక విషయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు అభాసుపాలవుతున్నాయి. స్థానికంగా అనుమతి ఉన్న రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనికి తోడు ఆయా శాఖల అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో అటువైపు చూడటంలేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అడపాదడపా తనిఖీలు జరుపుతూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక రవాణాను అరికట్టలేకపోతున్నారు. ఈ దందాపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయమల్లు

బోయినపల్లి, న్యూస్‌టుడే: బోయినపల్లి మండలం వరదవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన దేవయ్య, రాయమల్లు (40) అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లిలో దేవయ్య, రాయమల్లు పెద్దమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఒద్యారానికి చెందిన మరో పెద్దమ్మ కొడుకు ఎల్లయ్యను దింపడానికి బోయినపల్లి మీదుగా వస్తున్నారు. వరదవెల్లి ఆర్అండ్ఆర్ కాలనీ వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న అదే గ్రామానికి చెందిన అంజయ్య ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో రాయమల్లు, దేవయ్య, ఎల్లయ్య కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా రాయమల్లు మృతి చెందాడు. అతనికి భార్య రూప, కొడుకులు రఘు, గుణ ఉన్నారు. అంజయ్యను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కోడలు, మనవరాలిని కాపాడబోయి విషాదం

రాజయ్య

ధర్మారం, న్యూస్‌టుడే: కోడలు, మనవరాలిని విద్యుదాఘాతం నుంచి కాపాడబోయి కూలీ మృతి చెందిన ఘటన ధర్మారం మండలం కటికెనపల్లిలో విషాదం నింపింది. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మామిడి రాజయ్య(55) ఇంట్లో శుక్రవారం దుస్తులు ఆరేసుకునే దండేనికి విద్యుత్తు సరఫరా అయింది. ఇల్లు కడుగుతున్న రాజయ్య కోడలు శిరీష దాన్ని తాకడంతో షాక్ కొట్టింది. అక్కడే ఉన్న ఆమె కూతురు సంకీర్తనకూ విద్యుత్తు ప్రసారం కావడంతో ఇద్దరూ కేకలు వేశారు. ఇంటి బయట ఉన్న రాజయ్య వెంటనే ఇంట్లోకి వెళ్లి వారిని కాపాడే ప్రయత్నంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శిరీష, సంకీర్తనలను ఆసుపత్రికి తరలించారు. రాజయ్యకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగికి జైలు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ లంచం తీసుకున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మొకరాల శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ కోలం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నరసింహారెడ్డి.. రికార్డుల నిర్వహణ సరిగా లేని కారణంగా వారంపాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ప్రాజెక్టు డైరెక్టర్ అతడి సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఆ వారం రోజులను ఎర్నెడ్ సెలవుల కింద పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని 2009, ఏప్రిల్ 13న ఉట్నూర్‌లోని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మొకరాల శ్రీధర్‌ను నరసింహారెడ్డి ఆశ్రయించగా రూ.మూడు వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో నరసింహారెడ్డి 2009, ఏప్రిల్ 23న ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనిశా ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్.. రూ.3 వేల లంచం తీసుకున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. తదుపరి ఇన్‌స్పెక్టర్ మోహన్.. కోర్టులో ఈ మేరకు ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిషోర్‌కుమార్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుమార్ వివేక్ శుక్రవారం శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు నమోదు చేసినప్పుడు శ్రీధర్ వయసు 56 సంవత్సరాలు. ప్రస్తుతం 70 ఏళ్ల వయసులోనూ ఆయనకు శిక్ష తప్పకపోవడం గమనార్హం.

ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రేపట్నుంచి రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

టీజీఎస్- ఆర్టీసీ పర్యావరణహితంతోపాటు ఇంధన భారం తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తోంది. ఇందుకోసం జేబీఎం సంస్థతో ఒప్పందం కూడా చేసుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. మొదటి విడతగా ఇప్పటికే 35 సూపర్‌లగ్జరీ బస్సులు కరీంనగర్‌కు చేరుకున్నాయి. వాయిదా పడుతూ వస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించారు.

కరీంనగర్-2 డిపో కేంద్రంగా..

ఎలక్ట్రిక్ బస్సులను కరీంనగర్-2 డిపో కేంద్రంగా నడుపుతారు. ఇందుకోసం డిపో ఆవరణలో అవసరమైన ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణికుల కోసం అధునాతన సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వీటిని అద్దె ప్రాతిపదికన నడపనున్నారు. చోదకులతోపాటు ఇతర నిర్వహణ మొత్తం జేబీఎం సంస్థే చూసుకుంటుండగా ఆర్టీసీ మాత్రం కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇప్పటికే జేబీఎం సంస్థ డ్రైవర్లను నియమించుకొని వారికి శిక్షణ కూడా ఇచ్చింది.

ఏర్పాట్లు పూర్తి

ఎలక్ట్రికల్ బస్సులు రహదారిపై పరుగులు తీయడానికి అవసరమైన ఏర్పాట్లను ఆ సంస్థ పూర్తి చేసింది. బస్సుల రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర ప్రక్రియలను పూర్తి చేసింది. మరో 4 డీలక్స్ బస్సులు వచ్చినా వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇతర ప్రక్రియలు మాత్రం పూర్తి కావాల్సి ఉంది.

కరీంనగర్ నుంచి..

మార్గం	బస్సుల సంఖ్య
జేబీఎస్	39
గోదావరిఖని	9
మంథని	4
కామారెడ్డి	6
జగిత్యాల	6
రాజన్న సిరిసిల్ల	6

(ఇలా రూట్ వారీగా బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించినా.. మొదటి విడతలో వచ్చిన బస్సుల్లో 33 బస్సులను కేవలం జేబీఎస్‌కు మాత్రమే నడపనున్నారు. రెండు బస్సులు స్పేర్‌గా ఉంచుతారు. రెండో విడతలో వచ్చే బస్సులను ఇతర ఎంపిక చేసిన మార్గంలో నడపనున్నారు.)



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బస్సులు

జిల్లాకు రానున్న మంత్రులు

ఈ నెల 29న ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంత్రులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంస్థ ఎండీ సజ్జనార్ కరీంనగర్ రానున్నారు. అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు మంత్రుల చేతుల మీదుగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం జరగనుంది. ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఎం సుచరిత తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మోస్తరు వర్షసూచన

జగిత్యాల వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంకురిసే అవకాశముందని పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

పత్తి గరిష్ఠ ధర రూ.7,400

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 36 ట్రాలీల పాత, కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. విడిపత్తి క్వింటాలుకు రూ.కనిష్ఠ ధర రూ.7,000.. గరిష్ఠ ధర రూ.7,400 పలికింది. బస్తాల పత్తి రూ.6 వేల నుంచి రూ.7,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. కొత్తపత్తిని విక్రయానికి తీసుకొచ్చిన రైతులను మార్కెట్ కార్యదర్శి రాజా సన్మానించారు.

పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్, డాటా సైన్స్, మ్యాథమెటిక్స్) నాలుగు, రెండో సెమిస్టర్ ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నాలుగో సింహానికి ఏమైంది?



■ జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న మహిళా ఎస్సై తీరుపై ఇటీవల ఆరోపణలు వచ్చాయి. భార్యాభర్తల కేసు విషయంలో కౌన్సెలింగ్ చేయకుండా ఎస్సై కొట్టడంతో తన సోదరుడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆయన సోదరి రెండు రోజుల కిందట వీడియో విడుదల చేశారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందాడు.

■ జగిత్యాల జిల్లాలోని ఓ మహిళా కానిస్టేబుల్ ఇంటి వద్ద జరిగిన గొడవ విషయంలో మరో మండలానికి చెందిన ఎస్సైపై ఆరోపణలు వచ్చాయి. అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించగా చర్యలు కూడా తీసుకున్నారు.

■ కరీంనగర్ రెండో ఠాణాలో గతంలో పనిచేసిన ఓ సీఐ ఈ నెల 20న సస్పెండ్ అయ్యారు. నగరంలోని ఓ వ్యాపారి ఫైనాన్స్ కార్యాలయానికి సంబంధించి రూ.19,66,900లను తనిఖీల్లో భాగంగా ఆ సీఐ ఆధ్వర్యంలో పట్టుకెళ్లారు. నిబంధనల ప్రకారం బాధితుడికి తిరిగి ఇచ్చే నగదులో సీఐ కేవలం రూ.9లక్షలు మాత్రమే ఇచ్చి మిగతాది ఇచ్చేది లేదని, డబ్బు అడిగితే వేరే కేసులో ఇరికించి ఇబ్బందులు పెడుతానని హెచ్చరించారు. బాధితుడు భయంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. అక్కడి ఉన్నతాధికారులతోపాటు కరీంనగర్ సీపీని కొన్నాళ్ల కిందట కలిసి తన గోడుని వెలిబుచ్చడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సీఐ అక్రమాన్ని గుర్తించి విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఈనాడు, కరీంనగర్

ప్రజల మన్ననలు పొందుతూ మెరుగైన సేవలు అందించాల్సిన పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది దుందుడుకుగా వ్యవహరిస్తూ, వక్రమార్గంలో పయనిస్తూ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు. పేరుకే ఫ్రెండ్లీ పోలీసులమనే పంథాను చేతల్లో చూపుతున్నారు. చట్టాలు, నిబంధనల్ని తోసిరాజని.. తమకు నచ్చిన తీరుతో బాధితులతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. శాంతిభద్రతలు, నేరాల అదుపుపై దృష్టి పెట్టడం కన్నా 'మాకేంటి లాభమనే' విధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. అవసరమైన వాటి విషయంలో కాకుండా అనవసరమైన వాటి విషయంలో దూకుడును ప్రదర్శిస్తున్నారు.

అవినీతి బాటలో..

ఈ ఏడాది జూన్ 23న జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ఓ ఎస్సై మధ్యవర్తి ద్వారా లంచం తీసుకునేందుకు ప్రయత్నించిన తీరు సంచలనాన్ని రేకెత్తించింది. అనిశా అధికారులకు చిక్కకుండా ఆయన పరారైన తీరు పోలీసు శాఖకు తలవంపులు తెచ్చింది. గతంలోనూ సిరిసిల్ల జిల్లాలో ఇసుక ట్రాక్టర్‌ను విడిపించేందుకుగానూ లంచం అడిగారనే నెపంతో సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయంలోనే అనిశా అధికారులు పట్టుకున్న సంగతి ఇంకా ప్రజలు మరిచిపోలేదు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భూమాఫియాకు వత్తాసు పలికారనే అభియోగాలతో సొంత శాఖ ఉన్నతాధికారుల విచారణను నలుగురైదుగురు ఎదుర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోనూ అక్కడక్కడా పోలీసులు అత్యుత్సాహాన్ని చూపించిన ఉదంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కీలకమైన ఠాణాల్లో కొందరు కేసుల సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక, క్వారీలు, ఇతరత్రాలుగా నెలవారీ మామూళ్ల నెపంతో అమ్యామ్యాలను అందుకుంటున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

హెచ్చరిస్తున్నా.. మార్పు లేదు

ప్రభుత్వంతోపాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పోలీసుల వైఖరిలో మంచి మార్పు తీసుకు రావాలని పలుమార్లు హెచ్చరిస్తున్నా.. పలువురి వైఖరి మాత్రం మారడం లేదు. ఎవరేమంటారనే ధీమాతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. అప్పుడప్పుడు వెలుగు చూస్తున్న అక్రమాలు, ఆరోపణలు శాఖకు మచ్చకు తీసుకొస్తున్నప్పటికీ ప్రజలతో వ్యవహరించే తీరులో ఇంకా మార్పు రావడం లేదు. కేసు నమోదు చేయాలన్నా.. నమోదు కాకుండా ఆపాలన్నా.. ఇంత రేటని వసూలు చేయడం చాలా ఠాణాల్లో కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి. ఇక కొందరు తమ మార్కు ఇదేననే విధంగా మాటలతో బాధితులపై విరుచుకుపడుతున్న ఉదంతాలు న్నాయి. మర్యాద మాట అటుంచితే 'అరేయ్'.. అనే హూంకరింపు మొదలు బూతు పదాలతో రెచ్చిపోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 10న మెట్‌పల్లి ఠాణా ప్రాంగణంలో మహిళను పక్కకు నెట్టి లాఠీ ఎత్తిన సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇలా ఎక్కడికక్కడే పోలీసు సేవల్లో ఇబ్బందికర పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చేవిధంగా ఉన్నతాధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బాలలు.. ఇక పర్యాటక నేస్తాలు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది.

పాఠశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులతో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 25 నుంచి 29 మంది సభ్యులుగా ఉంటారు. ప్రతి క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా ఉంటాడు. ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తాయి.



పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు

■ క్లబ్ సభ్యులు విద్యార్థులలోని ఉత్సాహం, సాహసోపేతం, సృజనాత్మకత, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారు. ■ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజ్ఞాన, విహార యాత్ర, శాస్త్ర సాంకేతికత, ఉన్నత విద్యాసంస్థలు, చారిత్రక కట్టడాల సందర్శనలు చేసి తోటి విద్యార్థులకు అక్కడి విశేషాలను వివరించనున్నారు.

■ జిల్లాలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ఈ క్లబ్‌లను ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులు, యువతకు దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలపై తర్వాత తరానికి అవగాహన కల్పిస్తాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పనిసరిగా పాఠశాలల్లో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలి.

\- శైలజ, జిల్లా సమన్వయకర్త

ప్రచారమే లక్ష్యం

దేశంలో ముఖ్యంగా రాష్ట్రంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం, పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి పట్ల స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో ఈ క్లబ్‌లు పెంపొందిస్తాయి.

■ యువత, రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడతాయి.

■ పర్యాటకం, తెలంగాణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి.

■ విద్యార్థులతో ఈ ప్రాంత పర్యాటకంపై ప్రచారం చేసే బాధ్యతను ఈ క్లబ్‌లు తీసుకొంటాయి.

ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే : మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి శుక్రవారం ఆరు గేట్ల నుంచి 13,930 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 12,100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి 40,586 క్యూసెక్కుల వరద వస్తుండగా 4 స్పిల్‌వే గేట్లద్వారా 12,496 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను శుక్రవారం గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800 నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

గోదావరిఖని: ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తి 1.47 లక్షల క్యూసెక్కుల నీటిని శుక్రవారం దిగువకు వదిలారు. మధ్యాహ్నం అనంతరం ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో దిగువకు నీటిని వదిలారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ నుంచి 81,224 క్యూసెక్కులు, వరద నీరు 66,259 క్యూసెక్కులు చేరడంతో బ్యారేజీ నీటి మట్టం పెరిగింది. అప్రమత్తమైన అధికారులు 14 గేట్లను ఎత్తారు.

న్యూస్‌టుడే, మల్లాపూర్

? మల్లాపూర్-మెట్‌పల్లి మార్గంలో పలు చోట్ల ఆర్అండ్‌బీ రహదారులపై మొక్కజొన్న కంకులు వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- నవదీప్, సిరిపూర్**

✓ రైతులకు అవగాహన కల్పించి రహదారులపై మొక్కజొన్న కంకులు వేయకుండా జాగ్రత్తలు తీసుకొంటాం. **- నవీన్‌కుమార్, ఎస్సై మల్లాపూర్**

న్యూస్‌టుడే, మల్యాల

? మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. కాలనీలో అపరిశుభ్రత ఏర్పడటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. **- కొక్కుల శాంతక్క, మల్యాల**

✓ కాలనీలో మురుగు కాలువలతోపాటు పరిసరాలను శుభ్రం చేయిస్తున్నాం. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. **- శ్రీకాంత్, ఈవో**


మల్యాలలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే సత్యం

హామీలన్నీ నెరవేరుస్తున్నాం

మల్యాల, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం సాయంత్ర మండల కేంద్రంలోని రైతు వేదికలో 75 మంది లబ్ధిదారులకు రూ. 75,08,700 విలువగల కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. తహసీల్దారు మునిందర్, సింగిల్‌విండో అధ్యక్షుడు రాంలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీలు రవళి, ఆనందరెడ్డి, పోతాని రవి, శ్రీనివాస్‌గౌడ్, ఇమామ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ చౌరస్తా సమీపంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

అలిశెట్టి కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల పట్టణం: అక్షర సూరీడు అలిశెట్టి ప్రభాకర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా అంగడిబజార్‌లో లక్ష్మణ్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి శుక్రవారం నివాళి అర్పించారు. డీఆర్డీవో రఘువరణ్, బీసీ సంక్షేమ అధికారి సాయిబాబా, కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మెట్‌పల్లి: పోషకాలు లభించే ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా అన్నారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో శుక్రవారం పోషణ మాసం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు వంటి ఆహార పదార్థాలను తినాలని సూచించారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు.

బాలసదనం నుంచి బాలిక అదృశ్యం

జగిత్యాల విద్యానగర్: పట్టణంలోని బీష్మనగర్‌లోని బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాలిక(17) శుక్రవారం సాయంత్రం అదృశ్యమైంది. విషయం తెలిసిన నిర్వాహకులు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాలిక కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. పట్టణ ఎస్సై మన్మధరావు కేసు నమోదు చేశారు.

తేమ పేరుతో మిల్లర్లకు ఇబ్బందులు

బుగ్గారం : తేమ పేరుతో ఎఫ్‌సీఐ అధికారులు మిల్లర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొండ లక్ష్మణ్ అనే మిల్లు యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారం లేకుండా శుక్రవారం యశ్వంతరావుపేటలోని గోడౌన్-1లో లారీలో ఉంచిన 290 క్వింటాళ్ల బియ్యాన్ని తిరస్కరించినట్లు అధికారులు లేఖలో పేర్కొన్నారన్నారు. అధికారులు నిబంధనలను అతిక్రమించి కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తున్నట్లు వాపోయారు. అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.


పొలాస పరిశోధనస్థానంలో ఏడీఆర్, శాస్త్రవేత్తలు, సిబ్బంది


కొడిమ్యాలలో..


పెంబట్లలో..


రాయికల్ పట్టణంలో..


జగిత్యాల: జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వసంత


వెల్గటూరులో..

కొండా లక్ష్మణ్‌కు నివాళి

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


కోరుట్లలో..


పెగడపల్లిలో పద్మశాలి సేవా సంఘం


ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయంలో..


జగిత్యాలలో.. నివాళులర్పిస్తున్న ఆర్డీవో తదితరులు


మెట్‌పల్లిలో..


ధర్మపురి: తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో...


మల్లాపూర్‌లో..


ధర్మపురి పురపాలకంలో..

కొండగట్టులో అధికారుల పరిశీలన


ఆలయం ముందు బృహత్ ప్రణాళికను చూపుతున్న అధికారులు

మల్యాల, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకం కింద కొండగట్టు అంజన్న ఆలయంలో బృహత్ ప్రణాళిక అమలు కోసం పర్యాటక శాఖ, ప్లానింగ్ అధికారులు దేవాదాయశాఖ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో అధికారులతో కలిసి పర్యటించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొండపైన బృహత్ ప్రణాళిక అమలుతోపాటు వసతుల కల్పనకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ చూపారని, జిల్లా పాలనాధికారి సూచనల మేరకు బృహత్ ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

సారంగాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండలంలోని పెంబట్ల, కోనాపూర్, గుల్లపేట గ్రామాల్లో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలు, తీగలు పొలాల వెంట ఎక్కడైనా ఉంటే సత్వరమే సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే మరమ్మతు చేపడతామని రైతులకు సూచించారు. డీఈఈ గంగారాం, ఏడీఈ హరీష్, ఏఈ సతీష్, తిరుపతి, సహకార సంఘ అధ్యక్షుడు గుర్నాథం మల్లారెడ్డి, ఆకుల రాజిరెడ్డి, శిగిరి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొలస్తేశ్వరస్వామి ఆలయంలో యువటూరిజం సభ్యులు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం పొలాస పౌలస్తేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం స్థానిక ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల యువటూరిజం క్లబ్ సభ్యులు సందర్శించారు. పురాతన ఆలయ చరిత్ర గురించి తెలుసుకున్నారు. ప్రాచీన చరిత్ర ఆలయాన్ని సందర్శించటం సంతోషంగా ఉందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, యువటూరిజం సభ్యులు సాయి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలను అందించి మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి మహిళా సంఘం ద్వారా జగిత్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఐకాన్ బ్యూటీకేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. డీఆర్‌డీవో రఘువరణ్, లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ రామ్‌కుమార్, పురపాలక ఉపాధ్యక్షుడు గోలి శ్రీనివాస్, యూబీఐ చీఫ్ మేనేజర్ సుభాష్, ఫీల్డ్‌ఆఫీసర్ లక్ష్మీ, ఏపీఎం గంగాధర్, సీసీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం

రాయికల్, న్యూస్‌టుడే: దూరాభారమని విద్యార్థులు బడి మానకూడదని ఓ ఉపాధ్యాయుడు నిత్యం తన ద్విచక్రవాహనంపై తీసుకెళుతూ ఔదార్యం చాటుతున్నాడు. రాయికల్ మండలంలోని ధర్మాజిపేట ప్రాథమిక పాఠశాలకు నాయకపు గూడెంనకు మూడు కి.మీ దూరం కావడంతో చిన్నారులు సరిగా రావడంలేదు. పాఠశాలకు రాలేని వారిని గుర్తించి ఉపాధ్యాయుడు బాసమల్ల జనార్దన్‌రావు తన ద్విచక్రవాహనంపై తీసుకొస్తున్నారు. నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన చిన్నారులు చదువుకు దూరం కావద్దని సహోపాధ్యాయులు సహకారంతో ఈ ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

జగిత్యాల, న్యూస్‌టుడే: కొందరు తమ విధులకు ఆటంకం కలిగిస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగిత్యాల జనరల్ ఆసుపత్రి సిబ్బంది శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 25న మధ్యాహ్నం ఓ పేషంట్‌కు సంబంధించిన వ్యక్తికి బీపీ పరీక్ష చేసినప్పటికి చేయలేదని తప్పుడు ఫిర్యాదు చేశాడని అతనికి బీపీ పరీక్షించినట్లు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉందన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని మద్యం సేవించి వచ్చి గొడవకు దిగుతున్నారని అటువంటి వారిపై చర్య తీసుకుని తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

మనస్తాపంతోనే ఆత్మహత్య

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల చింతకుంట వాడకు చెందిన బొల్లారపు శివప్రసాద్(35) మనస్తాపంతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు ఆయన తల్లి బొల్లారపు నర్సమ్మ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివప్రసాద్‌కు కోరుట్లకు చెందిన కవితతో 15 సంవత్సరాల కిందట వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. 6 నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా 15 రోజుల కిందట కవిత ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఈనెల 22న శివప్రసాద్‌ను కోరుట్ల పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. 23న ఉదయం జగిత్యాలలో కడుపునొప్పి ఉందని శివప్రసాద్ చెప్పగా తల్లి నర్సమ్మ దుకాణానికి వెళ్లి మందులు తెచ్చేసరికి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని మొదట జగిత్యాల ఆసుపత్రికి తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై కొట్టడం వల్లే బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రచారం జరగ్గా తనను పోలీసుస్టేషన్‌కు పిలిపించాడని మనస్తాపం చెంది ఈ చర్యకు పాల్పడ్డట్లు శివప్రసాద్ తల్లి నర్సమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని శుక్రవారం జగిత్యాలకు తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

క్రైం కార్నర్

వృద్ధురాలి బలవన్మరణం

మల్యాల : మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కడారి నీలవ్వ(80) అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నీలవ్వ జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

బుగ్గారం : ప్రమాదవశాత్తు చెరువులో మునిగి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి సమాచారం మేరకు.. చిన్నాపూర్ గ్రామానికి చెందిన సుంకె పెద్దగంగయ్య(55) శుక్రవారం గేదెలను మేతకు తీసుకెళ్లాడు. కొన్ని గేదెలు సమీపంలోని యాదగిరి చెరువులోకి వెళ్లగా వాటిని ఒడ్డుకు చేర్చేందుకు అందులోకి దిగాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఊపిరాడక చనిపోయాడు. ఈ మేరకు గంగయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో మెట్‌పల్లి మండల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించి జిల్లా విజేతలుగా నిలిచారు. విద్యార్థినులను వ్యాయామోపాధ్యాయులు అశోక్, కొమురయ్య, చక్రధర్, జ్ఞానేశ్వర్, రాజేష్, మాధవీలత, కార్తీక్ అభినందించారు.

జగిత్యాల క్రీడావిభాగం: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానంలో మేడిపల్లి జట్టు, రెండో స్థానంలో జగిత్యాల మండలం, కబడ్డీలో మొదటి స్థానంలో మెట్‌పల్లి, రెండో స్థానంలో గొల్లపల్లి మండలం, ఖోఖోలో మొదటి స్థానంలో మేడపల్లి, రెండో స్థానంలో కథలాపూర్ జట్లు నిలిచాయని జిల్లా విద్యాధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఎంఈవో గాయత్రి, ప్రిన్సిపల్ అశోక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు క్రిష్ణప్రసాద్, అజయ్, కోటేశ్వర్, భాస్కర్, వేణు, పాల్గొన్నారు.


గొల్లపల్లి: విద్యార్థినుల నృత్యం


మెట్‌పల్లిలో..

అలరించిన స్వాగతోత్సవాలు

గొల్లపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వాగతోత్సవం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ మల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లిలో సాహితీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల స్వాగత వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు స్వాగతం పలికారు. ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చంద్రప్రకాష్, డైరెక్టర్లు సంతోష్ పాల్గొన్నారు.

'ఇంటర్ చదువు జీవితానికి మలుపు'

మల్లాపూర్: విద్యార్థి దశలో 'ఇంటర్ చదువు జీవితానికి మలుపు' అనే నినాదంతో కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నామని, ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని అవగాహన కల్పిస్తూనే 75 శాతం హాజరు తక్కువ కాకుండా క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేలా చూడాలని సూచిస్తున్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

మల్లాపూర్: మల్లాపూర్ మండల టీపీయూఎస్ అధ్యక్షుడిగా ధరవేని జీవన్, ప్రధాన కార్యదర్శిగా లావుడ్యా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు లింబగిరిస్వామి, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: తెలంగాణ పీఆర్‌టీయూ అనుబంధ తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా బోండ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా సందీప్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బి.పావని, కార్యదర్శిగా ఎం.స్వర్ణలత ఎంపికయ్యారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

మెట్‌పల్లి పట్టణం: దసరా శరన్నవరాత్రుల వేడుకలను ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో వేడుకల నిర్వహణపై కుల సంఘాల ప్రతినిధులతో చర్చించారు. పుర వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, ఆర్ఐ అక్షయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని పలుప్రైవేటు ఆసుపత్రులను మండల వైద్యాధికారి డా. రంజిత్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో రికార్డులను పరిశీలించారు. ఫీజులు, ఇతర వివరాలను నోటీస్‌బోర్డుపై ఉంచుతున్నారో లేదో అని తనిఖీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో నిర్వహించిన భగత్‌సింగ్ జయంతి కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తుక్కారం, రాజన్న, చిన్నారెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచండి

మెట్‌పల్లి పట్టణం: ఇంటింటా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని కమిషనర్ మోహన్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు చోట్ల పూలమొక్కలను నాటారు.

ఉత్తమ జీవనశైలితోనే ఆరోగ్యం

జగిత్యాల పట్టణం: ఉత్తమ జీవనశైలితోనే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు వినీల పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య స్ఫూర్తి సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ స్త్రీ వ్యాధులకు సంబంధించి పలు అపోహలను వివరించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపల్ కె.రామకృష్ణ, నీరజ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లి: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎన్.అరుణ్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మేజిస్ట్రేట్, న్యాయవాదులు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎల్ముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు, వైద్యులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కొడిమ్యాల: స్వచ్ఛా తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల కోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పరమేశ్వరి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పెగడపల్లి: పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి నరేష్ ఆరోగ్య నియమాలు, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

మెట్‌పల్లి: అక్టోబర్ 4న తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడికి రైతులు పెద్దఎత్తున తరలిరావాలని రైతు ఐక్యవేదిక నాయకులు కోరారు. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రైతులను కలిశారు. నల్ల రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మారు జనార్దన్‌రెడ్డి, గడ్డం రాజరెడ్డి, నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోండి

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి ఖాదీ వస్త్రాలపై 40 శాతం రాయితీని అందిస్తున్నట్లు, సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ బోర్డు మెంబర్ కె.నారాయణ తెలిపారు. శుక్రవారం రాయితీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 27 నుంచి నవంబర్ 16 వరకు రాయితీ కొనసాగుతుందన్నారు.

ప్రమాదం జరగకముందే మరమ్మతు చేపట్టాలి

సారంగాపూర్: ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న వంతెనకు మరమ్మతులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ వసంత డిమాండ్ చేశారు. శుక్రవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న వంతెనను పరిశీలించారు. రాంచందర్‌రావు, రమణ, రాజేశం, పాల్గొన్నారు.